క్లుప్తంగా

వికసిత్ భారత్ లక్ష్యం

గరుగుబిల్లి: వికసిత భారత్ లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందని జిల్లా బీజేపీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో సుపరిపాలన, పేదల సంక్షేమానికి 11ఏళ్లు కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ ఆధ్వర్యంలో దేశంలో ఎన్నో విప్లవాత్మకమైన నిర్ణయలను తీసుకొని దేశాభివృద్ధికి తోడ్పడడం జరిగిందన్నారు. పేదల సంక్షేమానికి, దేశ రక్షణకు బీజేపీ ఒక్కటే శరణ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమ్మ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రచ్చబండను ప్రారంభించిన ఎమ్మెల్యే

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని తురకనాయుడువలసలో హరిజన వాడలో గురువారం కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి రచ్చబండను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంగు సురేష్, స్థానిక సర్పంచ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ..



మృతి చెందిన జగ్గునాయుడు

వీరఘట్టం: ప్రస్తుత కాలంలో మరణం ఎప్పుడు ఎవరికీ ఎలా వస్తుందో చెప్పలేకపోతున్నాం. వీరఘట్టం బార్నాలవీధిలో చుక్కా జగ్గునాయుడు(52) తన ఇంటి ముందు ఫోన్‌లో మాట్లాడుతూ గురువారం ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తీరా అందరూ వచ్చి చూస్తే అక్కడికక్కడే మృతి చెందాడు. గుండె పోటుతో మృతి చెందినట్టు డాక్టర్లు తెలిపారు. ఉదయం భార్య, పిల్లలతో అందరితో సరదాగా ఉన్న వ్యక్తి క్షణాల్లోనే మృతి చెందాడనే విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు గొల్లుమన్నారు.

బదిలీ అధ్యాపకునికి సత్కారం



అధ్యాపకున్ని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యా పకులు, ఇతర సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఏపీ టీడబ్ల్యూఆర్ గర్ల్స్ జూనియర్ కళాశాలలో (పీటీజీ) కెమిస్ట్రీ అధ్యాపకునిగా పని చేస్తూ బదిలీపై అరకు ప్రాంతానికి వెళ్లిన శ్రీనివాసరావుకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డి.భారతి అధ్యక్షతన అధ్యాపకులు, ఇతర సిబ్బంది గురువారం ఘనంగా సత్కరించారు. కళాశాలలో ఉత్తమ సేవలందించిన శ్రీనివాసరావు బదిలీ జరిగిన కళాశాలలో కూడా విద్యార్థులకు మెరుగైన విద్యనందివ్వాలంటూ ఆకాంక్షించారు. జ్ఞాపికలను అందజేశారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం జుగాతో మేలు



చింతలపాడు గ్రామంలో నిర్వహించిన పీఎం జుగా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో త్రివిక్రమరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పీఎం డీఏ జుగాతో గిరిజన గ్రామాల్లో సమస్యలు పరిష్కారం అవుతాయని గుమ్మలక్ష్మీపురం ఎంపీడీవో త్రివిక్రమరావు చింతలపాడు గ్రామంలో, కురుపాం ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి కురుపాం మండలంలోని మరిపల్లి గ్రామంలో నిర్వహించిన పీఎం డీఏ జుగా కార్యక్రమాల్లో ప్రజలతో అన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని గిరిజనులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అందజేసిన వినతులు స్వీకరించారు. అలాగే పీఎం డీఏ జుగా లక్ష్యం గూర్చి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



సికిల్‌సెల్ దినోత్సవ ర్యాలీ

ప్రపంచ సికిల్‌సెల్ దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జగదీష్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జియ్యమ్మవలసలో గురువారం నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బంది హైమావతి, శ్రీనివాసరావు, జ్యోత్స్న, రాజేష్, నాగభూషణ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. –జియ్యమ్మవలస రూరల్

ధర లేక నిమ్మ రైతు దిగాలు

- గిట్టుబాటు లేక విలవిల
- మైదాన వ్యాపారులదే హవా



సీతంపేట: నిమ్మ దిగుబడులు ఏజెన్సీలో పెరిగినప్పటికి గిరిజన రైతులకు అనుకున్నంత ధరలు లేక పోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. మైదాన వ్యాపారులు చెప్పిన ధరలకు అమ్మకాలు జరపాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గిరిజనులు వాపోతున్నారు. అంతగా పెట్టుబడులు అక్కర్లేక పోయినప్పటికి సీతంపేట ఏజెన్సీలో సుమారు 10 ఎకరాల వరకు నిమ్మ పంటను కొండపోడు వ్యవసాయంలో భాగంగా పండిస్తారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట తక్కువ ధరలకు విక్రయించాల్సి వస్తుందని గిరిజన రైతులు వాపోతున్నారు. సీతంపేట ఏజెన్సీలో ఈ సంవత్సరం అధికంగా దిగుబడులు ఉన్నాయి. కావిడ నిమ్మ కాయలు రూ.400 నుంచి రూ.5 వందల వరకు విక్రయిస్తున్నామని గిరిజనులు తెలిపారు. గతేడాది ఇదే సీజన్లో ఒక్కో కావిడి రూ.6వందల వరకు విక్రయించే వారమని గిరిజనులు చెబుతున్నారు. ఒక్కో నిమ్మ పండు మైదాన ప్రాంతాల్లో రెండు రూపాయిల వరకు విడిగా విక్రయిస్తారు. ఇక్కడ ఒక్కో పండు అర్ధ రూపాయికి సరాసరి కారుచౌకగా కొనుగోలు చేసిన వ్యాపారులు పట్టణాల్లో అధికంగా విక్రయించి లాభాలను ఆర్జిస్తారు.

మైదాన వ్యాపారులదే హవా...

విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఇక్కడకు వచ్చి కొనుగోలు చేస్తారు. సీతంపేటలో సోమవారం, మర్రిపాడులో బుధవారం, గురువారం దోనుబాయిలో కుశిమి, పొల్ల గ్రామాల్లో శనివారం వారపు సంతలు జరుగుతాయి. ఈ సంతలకు వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తారు. గిరిజన రైతులు చెప్పిన ధరలు కాకుండా వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర నిర్ణయిస్తారు. దీంతో వారు చెప్పిన ధరలకు ఇవ్వాల్సి ఉంటుంది. కొన్ని గ్రామాల్లో గిరిజనులు ముందుగా దళారీ వ్యాపారుల నుంచి అడ్వాన్స్‌లు తీసుకుంటారు. పంట పక్వానికి వచ్చే సమయంలో ఆ పంటను వ్యాపారులకు ఇస్తారు. ఇలా కూడా గిరిజనులు నష్టాలు చవిచూడాల్సి వస్తుంది. ప్రతీ పంటలో ఇదే దోపిడీ చేసుకోవడం గమనార్హం.



సంచులతో నిమ్మకాయలను విక్రయానికి తెచ్చిన గిరిజనులు



శ్రమకు తగ్గ ఫలితం లేదు

గిరిజనులకు శ్రమకు తగ్గ ఫలితం లేదు. కావిడలు మోసుకొని తీసుకువచ్చినా గిట్టుబాటు ధరలు లేకపోవడంతో తక్కువ ధరలుకు విక్రయించాల్సి వస్తుంది. ప్రత్యేక మద్దత్తు ధరలు లేవు. దీంతో వ్యాపారులు నిర్ణయించిన ధరలకు అమ్మకాలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా స్పందించాలి.

– ఎస్.సన్నాయి, చాపరాయిగూడ



మద్దతు ధర కల్పించాలి

ప్రభుత్వ పరంగా ఏ పంటలకు కూడా మద్దతు ధరలు లేవు. కొండల పై గ్రామాల నుంచి ఎటువంటి ఉత్పత్తులు తీసుకువచ్చినా నష్టాలు తప్ప ఫలితం లేదు. గతేడాది కాలంగా ప్రతీ పంటలోనూ నష్టాలే చవిచూస్తున్నాం. ప్రభుత్వ పరంగా మద్దతు ధరలు లేవు.

– ఎస్.బంగారయ్య, పెద్దగూడ

జంగిల్ క్లియరెన్స్ చేయాలి

వీరఘట్టం: మండలంలోని వీరఘట్టం–సంత నర్సిపురం రోడ్డులో పిచ్చి మొక్కలు రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోవడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఈ రోడ్డులో వీరఘట్టం–బూరుగ గ్రామాల మధ్య, చలివేంద్రి–మహదేవివలస గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు దట్టంగా పేరుకుపోయాయి. ఈ రోడ్డులో మలుపుల వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు దగ్గరికి వచ్చే వరకు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



చలివేంద్రి సమీపంలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు

యోగాతోనే ఆరోగ్యం

జియ్యమ్మవలస: మండలంలోని అన్ని పాఠశాలల్లో యోగాపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ నెల 21వ తేదీన యోగా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు యోగా వలన కలిగే లాభాల గురించి వివరించారు. యోగాతోనే ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ప్రతి విద్యార్థి ప్రతిరోజూ యోగా సాధన చేయాలని సంబంధిత ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు.



జియ్యమ్మవలస: బిత్రపాడు ఎంపీయూపీ పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

యోగా డే రేపు

వీరఘట్టం: ఈ నెల 21న జరగనున్న యోగా డేను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో బి.వెంకటరమణ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతీ పంచాయతీలో యోగా డే ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొమరాడ: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలలో 6, 7, 8 తరగతులకు సంబంధించి ఖాళీ సీట్ల భర్తీ కోసం విద్యార్థులు ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎల్.పద్మావతి తెలిపారు. పాఠశాలకు స్వయంగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 25న నెల్లిమర్ల గురుకుల పాఠశాలలో పరీక్ష జరగనుందని, దానికి ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు.

పౌష్టికాహారం అందించండి

సీతంపేట: ప్రజలకు సరైన పౌష్టికాహారం అందించకుండా, ప్రజా వైద్యం అందించకుండా యోగా ద్వారా ఆరోగ్యం వస్తుందనడం ఎంత వరకు సమంజసమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు ఎం.తిరుపతిరావు గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేసి, మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. అప్పుడే ఆరోగ్యం సమకూరుతుందని పేర్కొన్నారు.

నేడు రెవెన్యూ సదస్సు

భామిని: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డే సందర్భంగా రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్టు ఎంఆర్ఐ మణి ప్రభాకరరావు గురువారం తెలిపారు. ప్రతీ ఏడాది జూన్ 10న రెవెన్యూ డే నిర్వహించడం ఆనవాయితీ అని పేర్కొన్నారు అన్ని వర్గాల వారు సదస్సులో పాల్గొనాలని కోరారు.

తల్లికి వందనంతో మోసం

భామిని: తల్లికి వందనం పేరున విద్యార్థుల తల్లులు గ్రామ సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బోదేపు శ్రీనివాసరావు గురువారం ఆరోపించారు. వందనం డబ్బులు అకౌంట్‌లో పడక పోవడంతో సమస్య పరిష్కారానికి గ్రామ సచివాలయాల చుట్టు తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వందనం అందని తల్లులు ఫిర్యాదులు అందుకోడానికి ఈ నెల 20వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఇవ్వడం సరికాదన్నారు. ప్రస్తుతం సచివాలయంలో ఫిర్యాదులు తీసుకొనే నాధుడే లేదని తెలిపారు.

ఉపాధి బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న నీలానగరం ఉపాధి వేతనదారులు

వీరఘట్టం: మండలంలోని నీలానగరంలో ఫీల్డ్ అసిస్టెంటు, టెక్నికల్ అసిస్టెంట్ల నిర్లక్ష్యంతో తమకు రావాల్సిన ఉపాధి హామీ బిల్లులు రాలేదని గ్రామానికి చెందిన 30 మంది వేతనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం సీపీఎం నాయకులు ఎస్.సింహాచలతో కలసి ఎంపీడీవో బి.వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. పని దినాలు లేకుండానే మాతో పనులు చేయించినట్టు ఏపీవో తెలిపారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బిల్లులు చెల్లించేందుకు ప్రతీ ఒక్కరి నుంచి రూ.50లు డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విచారణ చేపడతామని ఎంపీఈవో వారికి హామీ ఇచ్చారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకూ పోరాటం



లేబర్ కోడ్‌ల రద్దు కోసం ప్రచారం చేస్తున్న సీఐటీయూ నాయకులు

పాలకొండ: కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాటం తప్పదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు అన్నారు. సీఐటీయూ మండల కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు రద్దు కోసం ఈ నెల 25న జీపు జాత ప్రారంభిస్తున్నామని తెలిపారు. జూలై 9న చేపడుతున్న దేశ వ్యాప్త సమ్మె కోసం అన్ని వర్గాలు మద్దతు కోరుతున్నామని వివరించారు. కార్పొరేటర్ల ప్రయోజనం కోసం కార్మిక చట్టాలను రద్దు చేయడం తగదన్నారు. సీఐటీయూ నాయకులు కాద రావు, బి.అమరవేణి, జి.జెస్సీబాయ్, కె.శారద, ఎం.శ్రీదేవి, బి.కమల తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన వాటర్ ట్యాంక్ పనులు



గురండిలో మట్టి పోసి పిల్లర్స్ కోసం గజాలతో విడిచిపెట్టిన నిర్మాణ స్థలం

భామిని: మండలం నేరడి–బీ, గురండి గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ ద్వారా మంజూరైన మంచినీటి ట్యాంక్‌లు పనులు ఆరు నెలలుగా నిర్మాణంలోనే నిలిచిపోయాయి. బిల్లులు కాక నిర్మించిన పనులకు తెచ్చిన సరుకుల సొమ్ములు చెల్లించలేక సబ్ కాంట్రాక్టర్ కనపడకుండా పోయారని స్థానికులు చెబుతున్నారు. నేరడి–బీలో నీటి ట్యాంక్ పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయింది. గురండిలో కొత్తగా మట్టి వేసి పిల్లర్లకు గజాలు బిగించి మధ్యలో విడిచి పెట్టారు.

ప్రిన్సిపాల్‌గా కుమారస్వామి



పదోన్నతి పొందిన కుమారస్వామిని సత్కరిస్తున్న జీజేసీ సిబ్బంది

వీరఘట్టం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జంతు శాస్త్ర అధ్యాపకునిగా పని చేస్తున్న మాచర్ల కుమారస్వామిని కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ గురువారం విజయవాడ ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. పదోన్నతి పొందిన కుమారస్వామిని ఇక్కడ విధుల నుంచి వీరఘట్టం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.జి.ఎస్.వి.త్రినాథ్ రిలీవ్ చేశారు. కుమారస్వామికి సహచర అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.

నెలాఖరులోగా ఫాం పాండ్స్ పనులు పూర్తి చేయాలి



పెదబుడ్డిడిలో ఫాం పాండ్స్ పనులను పరిశీలిస్తున్న ఏపీవో

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని ఉపాధి హామీ పనుల్లో భాగంగా ఫాం పాండ్స్ పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశాలు ఇచ్చారని ఉపాధి హామీ ఏపీవో తుల సీదాస్ తెలిపారు. గురువారం పెదబుడ్డిడిలో జరుగుతున్న ఫాం పాండ్స్ పనులను ఆయన పరిశీలించారు. ఇప్పటివరకు బుడ్డిడిలో ఆరు ఫాం పాండ్స్ పనులు చురుగ్గా జరుగుతున్నాయని, సోమవారం నుంచి మరో 6 పనులను ప్రారంభించాలని ఆయన క్షేత్ర సహాయకులను ఆదేశించారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, అర్హులంతా వచ్చే నెల 17వ తేదీలోగా దగ్గర్లోని ఐటీఐలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. 21వ తేదీలోగా ఒరిజనల్ సర్టిఫికెట్లతో సీతంపేటలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ మోటార్ వెహికల్, వెల్డర్, కోపా కోర్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. వివరాలకు 7569062449, 9491134464 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

సారా రహిత గ్రామాలుగా రూపొందాలి



శ్రీరంగపాడు గ్రామంలో అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

గుమ్మలక్ష్మీపురం:

సారా రహిత గ్రామాలుగా భవిష్యత్తులోనూ కొనసాగనివ్వాలని బొద్దిడి, శ్రీరంగపాడు, లాడ గ్రామాల ప్రజలతో కురుపాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ పి.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు గురువారం పై గ్రామాలను సారా రహిత గ్రామాలుగా గుర్తిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సింహాద్రి నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా పై మూడు గ్రామాలను దత్తత తీసుకొని సారా నిర్మూలనకు కృషి చేశారన్నారు. గ్రామస్తులంతా సారా తయారీ, అమ్మకాలు లేకుండా ఉండడం మూలానా గ్రీన్ గ్రామాలుగా గుర్తించినట్టు సీఐ పేర్కొన్నారు. ఈ మేరకు గ్రీన్ గ్రామాలుగా ఎంపికైన బొద్దిడి, శ్రీరంగపాడు, లాడ గ్రామాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సింహాద్రి వీఆర్వోలు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువతతో కలిసి గ్రీన్ గ్రామం యొక్క ప్రాముఖ్యతను వివరించారు.

● ముమ్మరంగా పత్తి నాట్లు



గురండిలో పత్తి విత్తనాలు నాటుతున్న రైతు కుటుంబం

భామిని: జిల్లాలో పత్తి సాగులో గుర్తింపు పొందిన భామిని మండలంలో గురువారం ముమ్మరంగా పత్తి విత్తనాలు వేయడంలో రైతులు తలమునకలయ్యారు. వాతావరణం అనుకూలించి రెండు రోజులుగా వర్షాలు లేక పోవడంతో మొట్టు భూముల్లో పత్తి విత్తనాలు నాటుతున్నారు. రైతుల కుటుంబాలతో కలిసి ట్రాక్టర్లు దుక్కి వేసిన అనంతరం వరుస క్రమంలో తాడు కొలతలలో పత్తి విత్తనాలు వేయడం ప్రారంభించారు. ఇప్పటికీ రైతులకు ప్రభుత్వం పత్తి విత్తనాలు సరఫరా చేయకున్నా... ప్రైవేటు వ్యాపారుల వద్ద కొనుగోలు చేసి విత్తనాలు నాటుతున్నారు.

సమ్మె కోసం ర్యాలీ

జూలై 9వ తేదీన దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.వి.రమణ పిలుపునిచ్చారు. కురుపాం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం వివిధ రంగాల కార్మికులతో సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టడం ద్వారా కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరిస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో వివిధ రంగాల కార్మిక సంఘాల నాయకులు పి.సరోజ, కృష్ణవేణి, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు. – గుమ్మలక్ష్మీపురం(కురుపాం)

